క్లుప్తంగా

రేపు మాదిగల చైతన్య సభ

వెంకటగిరి: నియోజకవర్గంలోని సైదాపురంలో ఈనెల 19వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల చైతన్య సభను విజయవంతం చేయాలని ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ గద్దల మునెయ్య కోరారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాయకులు ఎం చెంచుకృష్ణ, ఎస్.మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకీసేవ


పల్లకీపై లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో వెలసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ నేత్రపర్వంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా చింతవరానికి చెందిన మారాణి సుబ్రహ్మణ్యం, నాగభూషణ వ్యవహరించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ నవీన్ కుమార్, ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

గూడూరు: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, పుస్తకాలపై అధికంగా వసూళ్లకు పాల్పడుతున్న కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న కోరారు. ఈమేరకు ఆయన పరిషత్ నాయకులతో కలసి గూడూరు ఉప విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. చిన్నా మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ నగర కార్యదర్శి శివశంకర్, జై కృష్ణ, చైతన్య, రోషన్, శివ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణపై అవగాహన


కొండాగుంట శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ రమణమ్మ, పశువైద్యాధికారి సుదర్శన్

గూడూరు : గూడూరు పట్టణంలో శనివారం పశు వైద్య బృందం గొర్రెల్లో వ్యాపించే నట్టల వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 1,4 వార్డు, చెన్నూరు, కొండాగుంట గ్రామాల్లో 1,220, బాలాయపల్లె మండలంలోని గ్రామాల్లో 4,600 గొర్రెలకు పరీక్షలు నిర్వహించి, అంతర పరాన్నజీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందును తాగించారు. రైతులకు మందులు ఉచితంగా అందజేశారు. నెలాఖరు వరకు ప్రతి గ్రామంలో పర్యటించి, గొర్రెలకు నట్టల నివారణ వైద్య సేవలతోపాటు మందులు తాగించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ పశు బీమా పథకంపై అవగాహన కల్పించారు. పశువైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

పెళ్లకూరు: డ్వాక్రా మహిళలు రుణాలను సక్రమంగా వినియోగించుకుంటూ సకాలంలో చెల్లించాలని తిరుపతి ఐబీడీ బీఎం మాధవి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణాలు ఎలా వినియోగించుకుంటున్నారనే విషయమై ప్రత్యేక నిఘా ఉంచాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీజీబీ మేనేజర్ వివేక్, ఏపీఎం మునిరాజయ్య, వివిధ ప్రాంతాల సీసీలు, వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ


పుస్తకాలను అందజేస్తున్న షార్ ఉద్యోగులు

తడ: తడ పంచాయతీ పల్లెపాళెం, నడిమి కుప్పం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షార్ ఎంప్లాయిస్ సేవా సంస్థ విద్యా సామగ్రిని వితరణగా అందజేసింది. శనివారం సర్పంచ్ కే.ఆర్మొగం చేతుమీదుగా వీటిని అందజేశారు. సంస్థ ప్రతినిధి శ్రీహరి, పల్లెపాళెం హెచ్ఎం భాస్కర్, షార్ ఉద్యోగులు దినేష్ కుమార్, వైభవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అంతా బాగున్నాం

- గడప గడపలో వృద్ధుల ఆనందం
- పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


వెంకటగిరి : నాలుగో వార్డు గడప గడపకు కార్యక్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: 'అయ్యా... జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాలాంటి ముసలోళ్లు.. రైతులు, ఆడోళ్లు అంతా సుఖంగా ఉన్నాం. మీ నాయన, అమ్మ హయాంలో వెంకటగిరి ప్రజలను కుటుంబసభ్యుల్లా ఆదరించి సమస్యలు పరిష్కరించారు.. మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తాం' అంటూ పలువురు వృద్ధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వంపై ఉన్న అభిమానాన్ని వైఎస్సార్‌సీపీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వద్ద వెలబిచ్చారు. శనివారం పట్టణంలోని 4వవార్డు పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ఆయన మమేకమయ్యారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. గతంలో వార్డు పర్యటనలో వచ్చిన సమస్యలను పరిష్కరించినందుకు పరమళాదేవి, పలువురు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలు ఇలాగే కొనసాగాలన్నా, మెరుగైన పాలన కావాలన్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ ఎంఎ నారాయణ, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పి.ప్రభావతి, వహీద, పట్టణ జేసీఎస్ కన్వీనర్ పులిప్రసాద్‌రెడ్డి, నాయకులు చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది ఎల కోటీశ్వరరావు, కమిషనర్ బీవీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


కయ్యూరులో పథకాలను వివరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లె): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బాలాయపల్లె మండలం కయ్యూరు పంచాయతీలో యాచవరం పీఏసీఎస్ అధ్యక్షుడు రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రామ్‌కుమార్‌రెడ్డి, ఆయన తనయుడు విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి పథకాలు అమలను వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అడుగడుగునా ఘనస్వాగతం పలుకుతూ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి, యాచరం పీఏసీఎస్ అధ్యక్షుడు రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు, ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, నాయకులు రవినాయుడు, కరణం రమేష్‌నాయుడు, రంగనాథం, సర్వేపల్లి సురేష్, వెందోటి హరికృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధితో ఆర్థికాభివృద్ధి


పున్నేపల్లెలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతోనే పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం గ్రద్దగుంట సచివాలయ పరిధిలోని పున్నేపల్లె, నెమళ్లపూడి పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆయా గ్రామస్తులు పూలమాలలతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లో అధికారులతో కలసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా కుల, మత, పార్టీలకతీతంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. వృద్ధులతో మాట్లాడుతూ పింఛన్ ఒకటో తేదీనే అందుతుందా అని అడిగారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు రాని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వినతులు స్వీకరించి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో అభివృద్ధి పథకాలకు సంబంధించి శిలఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పాదర్తి హరనాథ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పరంగి ప్రసాద్, సర్పంచ్‌లు శేషమ్మ, ఖాదర్‌బాషా, నాయకులు ప్రసాద్‌నాయుడు, వీరయ్య, శేఖర్, జనార్దన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సగుటూరు గ్రామానికి పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఈసందర్భంగా సర్పంచ్ పంజాం వసంతయమ్మ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు గూడూరు డిపో బస్సు సగుటూరు మీదుగా నాయుడుపేటకు వెళ్తుందని, ఆతర్వాత గ్రామానికి బస్సు సౌకర్యం లేదని తెలిపారు. విద్యార్థులు, వ్యాపారులు, ప్రజలు గూడూరు నుంచి సగుటూరు గ్రామానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సగుటూరు పంచాయితీ వడ్డిపాళెం గ్రామం నుంచి నాయుడుపేటకు రూ.30 వసూలు చేస్తున్నారని, వడ్డిపాళెం-కర్రబల్లవోలు గ్రామాల మధ్య 150 మీటర్ల దూరం ఉండడంతో రూ.10 చార్జీ అదనంగా పడుతోందని, ఈ క్రమంలో కర్రబల్లవోలు, వడ్డిపాళెంను ఒకే స్టేజీగా పరిగణిస్తే ప్రజలకు భారం తగ్గుతుందని కోరారు. దీనిపై తిరుపతి ఆర్‌ఎం చెంగల్‌రెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడారు. రెండు గ్రామాల మధ్య ఎంత దూరం ఉందో సర్వే చేయిస్తామని. డీఎంతో వివరాలు తెలుసుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఆర్‌ఎం తెలిపారు.


ఎమ్మెల్యేకు స్వాగతం పలుతున్న నాయకులు

నేడు గ్రద్దగుంటలో ఎమ్మెల్యే పర్యటన

మండలంలోని గ్రద్దగుంట గ్రామంలో ఆదివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుంటమడుగు రవీంద్రరాజు తెలిపారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలనలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వాకాడు(చిట్టమూరు): చిట్టమూరు మండలం కొత్తగుంట గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాల ఏర్పాటుకు శనివారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి పలు సమస్యలపై అధికారులతో మాట్లాడారు. నిత్యం జనసంచారంతో రద్దీగా మారిన కొత్తగుంట ప్రధాన కూడలిలో ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక శ్మశాన వాటిక, ఎలిమెంటరీ స్కూల్ ప్రహరీ గోడ విషయమై పలువురు అధికారులతో చర్చించారు. తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, నాయకులు మధుయాదవ్, సుధాకర్‌రెడ్డి, సుబ్బయ్య, చెంచయ్య, శ్రీహరిరెడ్డి, మణి, రెహమాన్, గజేంద్రరెడ్డి, బంగారయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ ద్వారా ఆలయాల అభివృద్ధి

చిల్లకూరు: తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని దళితవాడలు, గిరిజన కాలనీల్లో నూతన ఆలయాల నిర్మాణాలు, పురాతన ఆలయాల అభివృద్ధి వేగవంతంగా చేపట్టేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. చిల్లకూరులోని శంకర గిరిజన కాలనీలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయ కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలతో ఐక్యతాభావం ఏర్పడుతుందన్నారు. ఏగ్రామంలోనైనా ఆలయాల నిర్మాణాలకు ముందుకు వస్తే వారికి టీటీడీ ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, పారిశ్రామిక వేత్త తానంకి నానాజీ, నాయకులు వెదనపర్తి మనోజ్‌రెడ్డి, దువ్వూరు కిరణ్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు పట్టాభిరెడ్డి, కొట్టు అశోక్, యనమల అనుదీప్, మాజీ సర్పంచ్ నెల్లూరు రామూర్తి తదితరులు పాల్గొన్నారు.


కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్

కొత్త బోర్ల నుంచి తాగునీటి సరఫరా



నాయుడుపేటటౌన్ : పట్టణంలోని లోతువానిగుంట, పోలీస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో కొత్తగా వేసిన బోర్ల నుంచి తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు మున్సిపల్ చైర్ పర్సన్ దీపీక, కమిషనర్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు స్పందించి రెండు చోట్ల కొత్తగా బోర్లు వేయించారు. ఈబోర్ల నీటిని పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేపట్టారు.

అందరూ కూలీలమే ఆదుకోండి

కోట: ఆక్రమణల తొలగింపు పేరుతో అధికారులు బలవంతంగా మా ఇళ్లు నేలమట్టం చేసేందుకు చూస్తున్నారని కోట ఆకుతోటవీధిలో నివాసం ఉంటున్న మహిళలు వాపోయారు. శనివారం వారు తమ నివాసాల వద్దనే నిరసన తెలిపారు. ఇక్కడ రోడ్డు మార్జిన్ ఇళ్లు కట్టుకుని అనేక ఏళ్లుగా బతుకుతున్నామన్నారు. అందరూ కూలీ పనులకు వెళ్లే నిరుపేదలమేనని న్యాయం చేయాలని కోరారు.

వివాదాస్పద నిర్మాణాల పరిశీలన

చిల్లకూరు: మండలంలోని ఏరూరు గ్రామంలో ఓ ఇంటి నిర్మాణం వివాదస్పదంగా మారడంతో వాస్తవాలను తెలుసుకునేందుకు తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం కట్టడాలను పరిశీలించారు. గ్రామంలో సర్వే నంబర్ 1185లో సుమారు 50 సెంట్ల భూమిలో మంగమ్మ అనే మహిళ ఇంటి నిర్మాణాన్ని చేపట్టింది. అదే ప్రాంతానికి చెందిన రమేష్ ఈఇంటి నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టడాలను చేపడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కట్టడాలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. మరో సారి సర్వే చేయించే వరకు కట్టడాలు నిలుపుదల చేయాలని సూచించారు.

వైభవం..మాతాపరమేశ్వరి నగరోత్సవం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కాలనీ రైల్వేగేటు సమీపంలో ఉన్న శ్రీమాతా పరమేశ్వరి కొలుపు (జాతర)లో భాగంగా శనివారం రాత్రి అమ్మణ్ణి నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సుందరంగా అలంకరించిన అమ్మణ్ణిని ప్రత్యేక రథంపై కొలువుదీర్చి కాలనీలో నగరోత్సవం నిర్వహించారు. పోతురాజుకత్తి, తీన్‌మార్ బ్యాండు మేళాలు, యువత కేరింతల నడుమ నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున ముగ్గులతోపాటు పోతురాజు కథ కాలక్షేపాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


అమ్మవారి ఊరేగింపు

24 నుంచి జగనన్న సురక్ష

గూడూరురూరల్ : ఈనెల 24 నుంచి జులై 22వ తేదీ వరకు ప్రతి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గూడూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను గుర్తించాలని, స్పెషల్ డ్రైవ్‌లో వారికి అందించేలా సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, పెళ్లి, ఫ్యామిలీ మెంబర్, మ్యుటేషన్, సీసీఆర్‌సీ, ఆధార్ మొబైల్ లింక్ వంటి సర్టిఫికెట్లను అందజేయాల్సి ఉంటుందన్నారు. తహశీల్దార్ లీలారాణి పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

నాయుడుపేటటౌన్ : జగనన్న సురక్ష పథకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం 13 వార్డు సచివాలయాల అడ్మిన్‌లు, అన్ని విభాగాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దిన్, ఆర్ఐ షాజహాన్, గోవర్ధన్ లు ఉన్నారు.

సమస్యలకు పరిష్కారం

వెంకటగిరి: జగనన్న సురక్ష కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. స్థానిక పద్మశాలీ కళ్యాణ మండపంలో శనివారం కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 14 సచివాలయాల పరిధిలో 14 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ టీమ్‌లు ఇళ్ల యజమానులతో చర్చించి అందాల్సిన పథకాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. వైస్ చైర్మన్ సీహెచ్ ఉమామహేశ్వరి, విప్ పూజారి లక్ష్మి, కమిషనర్ బీవీ రామయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సైదాపురం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్షపై సమావేశంలో నిర్వహించారు. ఎంఈఓ దయాకర్, ఏపీఎం రాధ, ఏఈ భాస్కర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం :దొరవారిసత్రం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ సింగయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఏఓ రఘురామయ్య పాల్గొన్నారు.

వాకాడు: జగనన్న సురక్ష కార్యక్రమం ఇకపై గ్రామ సమస్యలకు చెక్ పడుతుందని వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీఓ గోపీనాథ్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బృందాలుగా గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు.

చిల్లకూరు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులతో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ గోపినాథ్ అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ అ జ్మతుల్లాకాన్, ఈఓపీఆర్‌డీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు:ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ రామ య్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష అమలుపై అవగాహన సమావేశం జరిగింది. ఎంపీడీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట మండలంలో జూలై 1 నుంచి జరుగనున్న జగనన్న సురక్ష పథకంపై ఎంపీడీవో శివప్రసాద్ అధ్యక్షతన సచివాలయ సిబ్బంది, మండల అధికారులతో సమావేశం జరిగింది. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసు కుని పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు.


వెంకటగిరి : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ

కమనీయం.. నృసింహుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న భక్తులు

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో వేకువజామునే శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది.

ఆనాటి ఆస్నేహమానందగీతం..

గూడూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఒక్కటయ్యారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారంతా పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు అందజేశారు. అనంతరం పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కష్టాల్లో ఉన్న తమ మిత్రులను ఆదుకునేందుకు సహాయనిధిని ఏర్పాటు చేశారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం రావూఫ్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

సైదాపురం: కారును తప్పించే క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండలంలోని చాగణం దళితవాడ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. రాపూరు మండలం, పోట్లూరుపాడు గ్రామానికి చెందిన శివకోటయ్య శనివారం స్వగ్రామం నుంచి ట్రాక్టర్‌లో వస్తున్నాడు. చాగణం దళితవాడ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో శివకోటయ్య(45) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు నెల్లూరులోని ఒక ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.


బోల్తాపడిన ట్రాక్టర్

వివాహిత ఆత్మహత్య

సైదాపురం : మండలంలోని చాగణం రాజుపాళెంలో శనివారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. స్థానిక గిరిజన కాలనీకి చెందిన చెంచయ్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య నాగమణి(30)తో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. భర్త ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు నాగమణి ప్రయతిస్తూ ఉండేది. అయినప్పటికీ చెంచయ్య వైఖరిలో మార్పు రాకపోడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.